క్లుప్తంగా

కమ్యూనిటీ హాల్ పరిశీలన



తుక్కుగూడ: మున్సిపాలిటీ కేంద్రంలోని 10వ వార్డులో అసంపూర్తి ఉన్న బీసీ కమ్యూనిటీ హాల్‌ను ఆ వార్డు కౌన్సిలర్ బాదావత్ రవినాయక్ సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. త్వరలో మున్సిపల్ నిధులు కేటాయించి హాల్ నిర్మాణ పనులు పూర్తి చేసి వినియోగంలోకి తీసుకువస్తామన్నారు. కార్యక్రమంలో కాంట్రాక్టర్ రాకేశ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఇన్‌స్పెక్టర్‌కు సన్మానం



ఇన్‌స్పెక్టర్ నాగరాజును సన్మానిస్తున్న కార్పొరేటర్ అనిల్‌యాదవ్

మీర్‌పేట: మీర్‌పేట కార్పొరేషన్ పరిధిలో గణేశ్ ఉత్సవాలు, దేవీ శరన్నవరాత్రి వేడుకలను విజయవంతంగా నిర్వహించిన సందర్భంగా సోమవారం మీర్‌పేట పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ నాగరాజును కార్పొరేటర్ ఎనుగుల అనిల్‌యాదవ్ శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉత్సవాల్లో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు విధులు నిర్వహించారని, శాంతిభద్రతల సమస్య తలెత్తకుండా ఇన్‌స్పెక్టర్ సిబ్బందితో నిరంతరం నిఘా ఉంచారని తెలిపారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు దోమలపల్లి రాజ్‌కుమార్ ఉన్నారు.

మహిళా సమాఖ్య భవనం నిర్మించాలని వినతి



ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

నందిగామ: మండల పరిధిలోని బుగ్గోనిగూడ గ్రామ పంచాయతీలో మహిళా సమాఖ్య భవనం నిర్మించాలని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌కు మహిళా సంఘం సభ్యులు, నాయకులు కోరారు. సోమవారం గ్రామంలో నిర్వహించిన గృహ ప్రవేశ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యేకు వారు వినతిపత్రం అందజేశారు. గ్రామంలో 10 మహిళా సంఘాల్లో 108 మంది సభ్యులు ఉన్నట్లు తెలిపారు. ప్రస్తుతం గ్రామంలో భవనంలేని కారణంగా వారు సమావేశాలు, ఇతర సమయాల్లో ఇబ్బందులు పడుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ శివశంకర్‌గౌడ్, నాయకులు శ్రావణ్, నర్సింహ, సాలయ్య, శ్రీనివాస్, ప్రభాకర్, మహిళా సంఘం సభ్యులు పాల్గొన్నారు.

అన్ని నాణేలు చెల్లుబాటులో ఉన్నాయి

మన్సూరాబాద్: నాణేలు చెల్లుబాటులో లేవనే అపోహవద్దని, అన్ని నాణేలు చెల్లుబాటులో ఉన్నాయని యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఎల్‌బీనగర్ బ్రాంచ్ మేనేజర్ రాజేంద్రప్రసాద్ అన్నారు. నాగోలు డివిజన్ పరిధి రాక్‌టౌన్‌కాలనీలోని యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా బ్రాంచ్‌కు వచ్చిన ఖాతాదారులకు రూ.10 నాణేలు అందజేసి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ.. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆదేశాల మేరకు నాణేలపై అవగాహన కల్పిస్తున్నామన్నారు. ముఖ్యంగా రూ.10 నాణేలు చెల్లుబాటులో లేవని అపోహ ప్రజల్లో ఉందని ఆ నాణేలు చలామణిలో ఉన్నాయని, ఎవరైన తీసుకోవటానికి సంకోచిస్తే సదరు వ్యక్తులపై ఫిర్యాదు చేయవచ్చని స్పష్టంచేశారు. ఈ కార్యక్రమంలో బ్యాంక్ సిబ్బంది నరేందర్, సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల్లో నాణ్యత పాటించాలి

నాగోలు: అభివృద్ధి పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలని నాగోలు కార్పొరేటర్ చింతల అరుణ అన్నారు. డివిజన్ పరిధిలోని సహదేవ్‌సింగ్‌నగర్‌లో సుమారు రూ.4.10 లక్షలతో చేపడుతున్న నూతన వాటర్ పైప్‌లైన్ పనులకు కార్పొరేటర్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. నూతనంగా నిర్మించబోయే పైప్‌లైన్ పనులను సకాలంలో పూర్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జలమండలి మేనేజర్ అర్చన, కేసీరెడ్డి, పద్మారెడ్డి, సత్యనారాయణ, జీహెచ్‌ఎంసీ జవాన్ లక్ష్మయ్య, కాలనీవాసులు పాల్గొన్నారు.

రోడ్డు పనుల పరిశీలన..

నాగోలు డివిజన్ బండ్లగూడ పెట్రోల్ బంక్ నుంచి తాజా హోటల్ వరకు చేపడుతున్న రోడ్డు పనులకు కార్పొరేటర్ చింతల అరుణ పరిశీలించారు.

లక్షలు వెచ్చించి.. లక్ష్యం నీరుగార్చి

రెండేళ్లుగా ప్రారంభం కాని షాపింగ్ కాంప్లెక్స్

- పట్టించుకోని అధికార యంత్రాంగం



నిరుపయోగంగా షాపింగ్ కాంప్లెక్స్

కడ్తాల్: రూ.లక్షలు వెచ్చించి మండల కేంద్రంలో నిర్మించిన షాపింగ్ కాంప్లెక్స్‌ను సంబంధిత అధికారులు ప్రారంభించకుండా వదిలివేయడంతో లక్ష్యం నీరుగారుతోంది. షాపింగ్ కాంప్లెక్స్ నిర్మించి రెండేళ్లు పూర్తయినా నేటికి ప్రారంభించక పోవడంతో నిరుపయోగంగా మారాయి. పాలశీతలీకరణ కేంద్రానికి ఆర్థిక వనరులు సమకూర్చేందుకు దుకాణ భవన సముదాయాన్ని నిర్మించారు. దాదాపు రెండేళ్లు అవుతున్నాఇంతవరకు ప్రారంభించక పోవడం గమనార్హం. షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణం కోసం ఎదురు చూస్తున్న స్థానికులు విచారం వ్యక్తం చేస్తున్నారు. గతంలో అనేక వినతి పత్రాలు ఇచ్చినా ప్రయోజనం కరువైంది.

2022లో నిర్మాణం పూర్తి

పాలశీతలీకరణ కేంద్రం ఆవరణలో షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణ పనులను 2022 జనవరిలో రూ.48 లక్షలతో గత ప్రభుత్వంలో భూమిపూజ చేసి, నిర్మాణ పనులను ప్రారంభించారు. పనులు వేగంగా సాగడంతో పది షాపుల గదుల నిర్మాణాలు 2022 ఆగస్టు నెల చివరి వారంలోనే పూర్తయ్యాయి. నిర్మాణ పనులు పూర్తయినప్పటి నుంచి షాపింగ్ కాంప్లెక్స్ ప్రారంభానికి చిరు వ్యాపారులతో పాటు నిరుద్యోగులు కళ్లు కాయలు కాసేలా ఎదురుచూస్తున్నారు. రూ.లక్షలు వెచ్చించి, లక్షణంగా వదిలేశారని స్థానికులు విమర్శిస్తున్నారు.

నిరాశలో చిరువ్యాపారులు

తెలంగాణ పాడిపారిశ్రామిభివృద్ధి సహకార సమాఖ్య ఆధ్వర్యంలో నిర్మించిన షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణం పూర్తయి 26 నెలలు కావొస్తున్న ప్రారంభించకపోవడం, వాటికి వేలం నిర్వహించకపోవడంతో స్థానికులు, చిరువ్యాపారుల నుంచి తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. షాపింగ్ కాంప్లెక్స్‌లో గదులు అద్దెకు తీసుకుని ఉపాధి పొందుదామని ఎదురు చూస్తున్న ఎంతో మంది నిరుద్యోగులు, చిరువ్యాపారులు భవనాలు ప్రారంభించక పోవడంతో నిరాశ చెందుతున్నారు. అటు ప్రారంభించకుండా ఇటు వేలం నిర్వహించి, అద్దెకివ్వకుండా సంబంధిత అధికార యంత్రాంగం నిర్లక్ష్యంగా వ్యవహరించడంపై స్థానికులు మండి పడుతున్నారు.

పెరిగిన జనాల తాకిడి

మండల కేంద్రం కావడంతో జనాల తాకిడి భారీగా పెరిగి, అద్దెకు షాపులు దొరకని పరిస్థితి నెలకొంది. కడ్తాల్ పట్టణ నడిబొడ్డున పాలశీతలీకరణ కేంద్రం ఆవరణలో ప్రభుత్వం వ్యాపార సముదాయం ఏర్పాటు చేస్తే సౌకర్యంగా ఉంటుందని స్థానికులు ఎదురు చూశారు. ప్రధాన రహదారికి ఇరువైపులా రోడ్లపై చిన్న, చిన్న డబ్బాలు, కొట్టులను ఏర్పాటు చేసుకొని కొన్నేళ్లుగా ఎంతో మంది జీవనం సాగిస్తున్నారు. ఏడేళ్ల క్రితం శ్రీశైలం–హైదరాబాద్ రోడ్డు విస్తరణతో ఇరువైపులా ఉన్నా చిరు దుకాణాలన్నింటిని తొలగించడంతో ఎంతో మంది చిరు వ్యాపారులు నష్టపోయారు. దాదాపు 50 కుటుంబాల వరకు ఉపాధి కోల్పోయారు. సంబంధిత శాఖ అధికారులు, ప్రజా ప్రతినిధులు స్థానికుల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని వెంటనే షాపింగ్ కాంప్లెక్స్ ప్రారంభించి, వేలం నిర్వహించాలని స్థానికులు కోరుతున్నారు.

అనాథ విద్యార్థులకు ఆర్థిక సహాయం

దిల్‌సుఖ్‌నగర్: మన్సూరాబాద్ డివిజన్ విజయశ్రీ కాలనీ అధ్యక్షులు జొన్నాడ మోహన్ రెడ్డి, వారి అమ్మా నాన్నల మొదటి వర్ధంతి సందర్భంగా ఆర్‌కేపురం డివిజన్ చిత్రలేవుట్ కాలనీలోని అనాథ విద్యార్థి గృహా విద్యార్థుల వసతులు, చదువుల కోసం రూ.50 వేల విరాళం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ విద్యార్థి గృహంలో అవకాశం రావడం మీ అదృష్టమని గృహ కమిటీ కల్పించిన అన్ని సౌకర్యాలు, విద్యా అవకాశాలు సద్వినియోగం చేసుకుని ఉన్నత స్థానాలకు చేరుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గృహ అధ్యక్షులు మార్గం రాజేష్, మోహన్‌రెడ్డి సతీమణి మీనా, కుమారుడు జ్ఞానసాయి రెడ్డి, జంగా రెడ్డి, హర్ష పాల్గొన్నారు.



ఆర్థిక సహాయం అందజేస్తున్న మోహన్‌రెడ్డి కుటుంబ సభ్యులు

ఎమ్మెల్యేను కలిసిన నాయకులు



కందుకూరు: సబితారెడ్డికి శుభాకాంక్షలు తెలుపుతున్న బీఆర్‌ఎస్ శ్రేణులు

కందుకూరు: దసరా పండుగను పురస్కరించుకుని బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు స్థానిక ఎమ్మెల్యే సబితారెడ్డిని సోమవారం ఆమె నివాసంలో కలిసి శుభాకాంక్షలు తెలిపారు. మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ఎస్.సురేందర్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ డి.చంద్రశేఖర్, పార్టీ మండల అధ్యక్షుడు మన్నే జయేందర్ ముదిరాజ్, సీనియర్ నాయకుడు కాకి దశరథ ఆధ్వర్యంలో సబితారెడ్డిని కలిశారు. వారి వెంట పీఏసీఎస్ మాజీ చైర్మన్ ఆర్.ప్రభాకర్‌రెడ్డి, డైరెక్టర్లు పి.ఆనంద్, ఎస్.శేఖర్‌రెడ్డి, ఆ పార్టీ నాయకులు దర్శన్‌రెడ్డి, శేఖర్‌గుప్తా, వెంకటేష్, రాములు, సంజీవరెడ్డి, కృష్ణారెడ్డి, వెంకట్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, హన్మంత్‌రెడ్డి, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

తుక్కుగూడ కౌన్సిలర్..

తుక్కుగూడ: మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే పి.సబితారెడ్డిని సోమవారం నగరంలోని ఆమె క్యాంపు కార్యాలయంలో తుక్కుగూడ మున్సిపాలిటీ కౌన్సిలర్ బాదావత్ రవినాయక్ మర్యాద పూర్వకంగా కలిశారు. దసరా పండగ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వార్డు అభివృద్ధికి నిధులు కేటాయించాలని విజ్ఞప్తి చేశానన్నారు. ఆయన వెంట బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు శ్రీధర్‌రెడ్డి, రాహుల్ పాల్గొన్నారు.



తుక్కుగూడ: మాజీ మంత్రికి మొక్కను అందజేస్తున్న రవినాయక్

సీఎం రేవంత్‌రెడ్డికి స్వాగతం



సీఎం రేవంత్‌రెడ్డికి స్వాగతం పలికేందుకు ఔటర్ ఎగ్జిట్ వద్ద ఉన్న నాయకులు

భారీ ర్యాలీగా తరలివచ్చిన నాయకులు

మహేశ్వరం: కొంగరకలాన్ ఫాక్స్‌కాన్ కంపెనీ పనులను పరిశీలించడానికి విచ్చేసిన సీఎం రేవంత్‌రెడ్డికి స్వాగతం పలికేందుకు మహేశ్వరం నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు సోమవారం భారీగా తరలివెళ్లారు. నియోజకవర్గంలోని అన్ని మండలాలు, మున్సిపాలిటీలు, కార్పొరేషన్లకు చెందిన కాంగ్రెస్ శ్రేణులు మాజీ ఎమ్మెల్యే కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి, పీసీసీ సభ్యుడు దేప భాస్కర్‌రెడ్డి, జెడ్పీ మాజీ ఫ్లోర్ లీడర్ ఏనుగు జంగారెడ్డి, అమరేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో రావిర్యాల ఔటర్‌రింగ్ ఎగ్జిట్ 13 వరకు భారీ ర్యాలీగా చేరుకొని సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి శ్రీధర్ బాబులకు ఘన స్వాగతం పలికారు. సీఎం రేవంత్‌రెడ్డి ఔటర్ దిగగానే కేఎల్లార్‌తో పాటు నాయకులు కలిసి కాంగ్రెస్ కండువాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు బొక్క జంగారెడ్డి, ఎర్రవాపు ఇశ్రాయేల్, కాకి ఈశ్వర్, కృష్ణనాయక్, రాజునాయక్, లచ్చానాయక్, జానకీరామ్, జైపాల్‌రెడ్డి, రాజు, రంజిత్‌కుమార్, మురళీధర్‌రెడ్డి, లాజర్, పాండురంగారెడ్డి, జంగయ్య పాల్గొన్నారు.

రైతు బజార్‌లలో కూరగాయల ధరలు

వనస్థలిపురం: సరూర్‌నగర్/ వనస్థలిపురం రైతుబజార్‌లలో కూరగాయల ధరల వివరాలు.. టమాట రూ. 55, వంకాయ రూ. 35, బెండ రూ. 35, పచ్చిమిర్చి రూ. 50, కాకర రూ. 38, బీర రూ. 45, క్యాబేజి రూ. 23, ఫ్రెంచి బీన్స్ రూ. 105, క్యారెట్ రూ. 40, దొండ రూ. 35–38, చిక్కుడు రూ. 55, గోకర రూ. 40, బీట్‌రూట్ రూ. 25, క్యాప్సికం రూ. 70, ఆలు రూ. 37, దోస రూ. 35, సొర రూ. 17, పొట్ల రూ. 23, ఉల్లిగడ్డ రూ. 45, చామగడ్డ రూ. 35. ఈ ధరలు మంగళవారం ఉదయం 9 గంటల వరకు మాత్రమే అమలులో ఉంటాయి.

మూసీ నిర్వాసితులకు రుణాలు

చాదర్‌ఘాట్: మూసీ పరిసరాల్లో ఇళ్లు కోల్పోయిన వారికి యూసీడీ ఆధ్వర్యంలో సెల్ఫ్‌హెల్ప్ గ్రూపులు ఏర్పాటు చేస్తున్నట్లు మలక్‌పేట యూసీడీ పీఓ ప్రాజెక్ట్ ఆఫీసర్ యుగంధర్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిర్వాసితుల్లో 130 మంది మహిళలు ఉన్నారని అందులో 120 మంది మహిళ సెల్ఫ్‌హెల్ప్ గ్రూపులకు అర్హత సాధించినట్లు తెలిపారు. ఒక్కొక్క గ్రూపులో 10 మందిని ఒక్క యూనిట్‌గా ఏర్పాటు చేసి మొత్తం 12 గ్రూపులు ఏర్పాటు చేశామన్నారు. ఒక్కొక్క యూనిట్ సభ్యులకు రూ. 10 లక్షల నుంచి రూ.15 లక్షల వరకు రుణాలు ఇస్తామని ఆయన వెల్లడించారు.

మెడికల్ ఆఫీసర్‌గా తరుణి

చాదర్‌ఘాట్: ఓల్డ్‌మలక్‌పేట డివిజన్ యూపీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్‌గా డాక్టర్ తరుణిని నియమించినట్లు డిప్యూటీ డీఎంహెచ్‌ఓ బ్రిజిన్నిషా తెలిపారు. రూ.50 లక్షలతో నిర్మించిన యూపీహెచ్‌సీ హాస్పిటల్ భవనాన్ని త్వరలోనే ఎమ్మెల్యే, ఎంపీ చేతుల మీదుగా ప్రారంభిస్తామన్నారు.

ప్రజావాణిలో ఫిర్యాదులు నిల్

చాదర్‌ఘాట్: ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణిలో ఎలాంటి ఫిర్యాదులు రాలేదని మలక్‌పేట సర్కిల్–6 డిప్యూటీ కమిషనర్ జయంత్ తెలిపారు. ఫిర్యాదులన్నీ ఆన్‌లైన్‌లో నే చేస్తున్నారని టౌన్‌ప్లానింగ్ అధికారులపైనే అధిక సంఖ్యల్లో ఫిర్యాదులు వస్తున్నాయన్నారు.

కేఎల్లార్‌ను కలిసిన నేతలు



కేఎల్లార్‌ను శాలువాతో సన్మానిస్తున్న కాంగ్రెస్ నాయకులు

కందుకూరు: దసరా పండుగను పురస్కరించుకుని పలువురు నేతలు మాజీ ఎమ్మెల్యే కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి (కేఎల్లార్)ని మర్యాదపూర్వకంగా కలిశారు. జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ కప్పాటి పాండురంగారెడ్డి, టీపీసీసీ ప్రచార కమిటీ సభ్యుడు ఏనుగు జంగారెడ్డి, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు బొక్క జంగారెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల మాజీ అధ్యక్షుడు ఎస్.కృష్ణనాయక్ ఆధ్వర్యంలో సోమవారం కేఎల్లార్‌ను ఆయన కార్యాలయంలో కలిసి శుభాకాంక్షలు తెలిపి శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా కేఎల్లార్ మాట్లాడుతూ.. బడుగు, బలహీనవర్గాలతో పాటు పేద వర్గాలను దృష్టిలో ఉంచుకుని అనేక సంక్షేమ కార్యక్రమాలను ప్రజా ప్రభుత్వం అమలు చేస్తుందని కొనియాడారు. ప్రజా పాలనలో నియోజకరవ్గం అన్ని రంగాల్లో ప్రగతి సాధించి ఫలాలు ప్రజలందరికి అందేలా నాయకులు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు సత్యనారాయణ, రాకేష్‌గౌడ్, బాబురావు, గణేషనాయక్, నర్సింహ తదితరులు పాల్గొన్నారు.

నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యం

మాజీ ఎమ్మెల్యే కేఎల్ఆర్

మహేశ్వరం: మహేశ్వరం నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యంగా తాను నిరంతరం పనిచేస్తానని మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి పేర్కొన్నారు. సోమవారం మండలానికి చెందిన పలువురు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తుక్కుగూడలోని తన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి పుష్ప గుచ్ఛం అందజేసి దసరా శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మహేశ్వరం నియోజకవర్గ అభివృద్ధి విషయంలో రాజీపడే ప్రసక్తే లేదన్నారు. రోడ్లు, భవనాల నిర్మాణం, అండర్ గ్రౌండ్, డ్రైనేజీ నిర్మాణాలతో పాటు పలు అభివృద్ధి పనులకు కావాల్సిన నిధులను సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, జిల్లా ఇన్‌చార్జి మంత్రి శ్రీధర్ బాబుల దృష్టికి తీసుకెళ్లి మంజూరు చేయిస్తానని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వంలోనే మహేశ్వరం నియోజకవర్గం అభివృద్ధి చెందిందని, మరింత చెందుతుందన్నారు. ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను అర్హులకు అందేవిధంగా ప్రతీ నాయకుడు, కార్యకర్త కృషి చేయాలని సూచించారు. పార్టీ కోసం కష్టపడిన నాయకులు, కార్యకర్తలకు ప్రాధాన్యత కల్పిస్తామన్నారు. త్వరలో ఇందిరమ్మ కమిటీలను ప్రభుత్వం నియమిస్తుందన్నారు. అంతకు ముందు మండలానికి చెందిన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు లక్ష్మారెడ్డిని కలిసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల మాజీ అధ్యక్షుడు కాకి ఈశ్వర్‌ముదిరాజ్, శివగంగ రాజరాజేశ్వర ఆలయ చైర్మన్ కుమార్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు నేనావత్ రాజునాయక్, జంగయ్య, ఏర్పుల శ్రీశైలం, గణేశ్, పరమేశ్, సేవ్యానాయక్ తదితరులు పాల్గొన్నారు.



కేఎల్లార్‌కు మొక్క అందజేస్తున్న శివగంగ ఆలయ చైర్మన్ అల్లె కుమార్, నాయకులు

ఆగుతూ.. సాగుతూ..

అర్ధంతరంగా నిలిచిన రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణ పనులు

- పిల్లర్ల దశలోనే దర్శనమిస్తున్న వైనం
- రైల్వే గేటుతో ఇబ్బంది పడుతున్న వాహనదారులు
- పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు



పిల్లర్లు దశలోనే బ్రిడ్జి నిర్మాణం



గేటు వేయడంతో నిలిచిన వాహనాలు

షాద్‌నగర్: రైళ్ల రాకపోకలతో ప్రయాణికులు ఎన్నో ఏళ్లుగా ఇబ్బందులు పడుతున్నారు. మాటిమాటికి గేటు వేస్తుండటంతో వాహనాలు తరచూ గేటు వద్ద ఆగిపోతున్నాయి. ఫలితంగా వాహనదారులు ఇబ్బంది పడటంతో పాటు ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నాయి. ప్రజలు ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న పట్టణంలోని చటాన్‌పల్లి రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణ పనులు గత ప్రభుత్వ హయాంలో ప్రారంభమయ్యాయి. కానీ ఆ పనులు పలు కారణాలతో అర్ధంతరంగా నిలిచిపోయాయి. దీంతో ప్రయాణికులకు ఇబ్బందులు తప్పడం లేదు.

రైల్వే గేటుతో తప్పని తిప్పలు

షాద్‌నగర్ మీదుగా ప్రతీ రోజు సుమారు ఇరవై రైళ్లు రాకపోకలు కొనసాగిస్తుంటాయి. పట్టణంలోని చటాన్‌పల్లి, కేశంపేట రోడ్డులో రైల్వే గేట్లు ఉన్నాయి. చటాన్‌పల్లి రైల్వేగేటు మీదుగా చటాన్‌పల్లి, బీవీరావునగర్, బుచ్చిగూడ, కొండన్నగూడ, వెల్జర్ల, సంగెం, కొత్తపేటకు చెందిన వేలాదిమంది నిత్యం రాకపోకలు సాగిస్తుంటారు. అదేవిధంగా వాహనదారులు జాతీయ రహదారి బైపాస్ నుంచి షాద్‌నగర్ పట్టణంలోని నుంచి వికారాబాద్, పరిగి వెళ్లాలన్నా చటాన్‌పల్లి రైల్వే గేటును దాటి రావాల్సి ఉంటుంది. దీంతో అనునిత్యం వేల సంఖ్యలో వాహనాల రాకపోకలతో ఈ రహదారి ఎంతో రద్దీగా ఉంటుంది. తరచూ గేటు వేస్తుండటంతో వందల సంఖ్యలో వాహనాలు రైల్వేగేటు వద్ద ఆగిపోతున్నాయి. దీంతో అత్యవసర పరిస్థితులలో గేట్లను దాటి వెళ్లలేని పరిస్థితి నెలకొంది. అదేవిధంగా గేటు తీసిన తర్వాత కూడా వాహనాలు అన్నీ ఒకేసారి ముందుకు కదులుతుండటంతో ట్రాఫిక్ సమస్య నెలకొంటుంది. మాజీ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ పలుమార్లు దక్షిణ మధ్య రైల్వే అధికారులు, ఆర్‌అండ్‌బీ అధికారులతో కలిసి నిధులు మంజూరు చేయించారు.

ఇదీ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వాటా

చటాన్‌పల్లి రైల్వే ఓవర్ బ్రిడ్జిని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. అయితే గత ప్రభుత్వ హయాంలో బ్రిడ్జి నిర్మాణానికి అయ్యే మొత్తం వ్యయం రూ.95కోట్లు కాగా ఇందులో రాష్ట్ర ప్రభుత్వం రూ.61.31కోట్లు మంజూరు చేసి పరిపాలన అనుమతులు జారీ చేయడంలో పనులు ప్రారంభమయ్యాయి.

నిలిచిన పనులు

రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణంలో భాగంగా పిల్లర్లను నిర్మించారు. గత ప్రభుత్వ హయంలో డిజైన్ చేసిన విధానంలో కాకుండా వై జంక్షన్ బ్రిడ్జి నిర్మించేందుకు ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ చర్యలు చేపట్టారు. గతంలో డిజైన్ చేసిన విధంగా బ్రిడ్జిని నిర్మిస్తే వాహనదారులకు ఇబ్బందులు తప్పవనే ఉద్దేశంతో వైజంక్షన్ బ్రిడ్జిని నిర్మించేందుకు చర్యలు చేపట్టారు. దీంతో గత కొన్నినెలలుగా నిర్మాణ పనులు అర్ధంతరంగా ఆగిపోయాయి. ఇటీవల సీఎం రేవంత్‌రెడ్డి కొందుర్గు పర్యటనకు వచ్చినప్పుడు ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణానికి అదనంగా రూ.89కోట్లు మంజూరు చేయాలని కోరారు.

అందరూ ధార్మికంగా ఉండాలి

దిల్‌సుఖ్‌నగర్: మంచి చేయడం ఎంత ముఖ్యమో చెడు చేయకుండా ఉండడం అంతే ముఖ్యమని ఇస్కాన్ టెంపుల్ బ్రహ్మచారి ప్రణవానంద దాస్ అన్నారు. మహేశ్వరం నియోజకవర్గం ఆర్‌కేపురం డివిజన్‌లో సోమవారం నిర్వహించిన మహా సత్సంగము నగర సంకీర్తనలో భాగంగా వాసవికాలనీ అష్టలక్ష్మి దేవాలయం నుంచి శ్రీరామకృష్ణపురం కోఆపరేటివ్ సొసైటీ వరకు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ప్రణవనంద దాస్ మాట్లాడుతూ.. సమయాన్ని అక్కర్లేని విషయాల కోసం వృథా చేసుకోవడం చాలా బాధాకరమని అందరూ మంచిగా ధార్మికంగా ఉండడానికి ప్రయత్నం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఇస్కాన్ ప్రతినిధులు శ్రీనివాస్ అతిప్రియ దాస్, మాయ నర్సింగ్‌రావు, అష్టలక్ష్మి దేవాలయ వ్యవస్థాపక అధ్యక్షులు చంద్రశేఖర్ గుప్తా, ఉపేందర్‌రెడ్డి, రామరావ్, రమేష్‌బాబు, గందే శ్రీకాంత్, విజయలక్ష్మి, నీలిమ, రాధ, సురేఖ, అర్చన, పుష్ప పాల్గొన్నారు.